నేడు రైతులకు పంటలపై అవగాహన

కీసర: కీసరలోని రైతువేదికలో నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కీసర మండల వ్యవసాయశాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రాజేంద్రనగర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు గ్రామానికి వచ్చి అవగాహన కల్పిస్తారని, రైతులందరూ హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ కేంద్రమంత్రి ఎంఆర్‌. కృష్ణకు ఘన నివాళి

అల్వాల్‌: పేదల సంక్షేమం కోసం మాజీ కేంద్ర మంత్రి ఎంఆర్‌. కృష్ణ చేసిన సేవలు మరువలేనివని అల్వాల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 21వ వర్ధంతి సందర్భంగా సోమవారం అల్వాల్‌లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్‌ వీఆర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పలువురు పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు వరలక్ష్మి, బీఎస్‌గిల్‌, వేణుగోపాల్‌, సురేందర్‌రెడ్డి, శంకర్‌, రాకేష్‌, జార్జ్‌, ప్రేమ్‌కుమార్‌, యాదగిరిగౌడ్‌, సాజిత్‌, అనిల్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



క్రికెట్‌కిట్‌ అందజేస్తున్న కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌

మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవిశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ సూచించారు. సోమవారం సీఫెల్‌కాలనీ గ్రౌండ్‌లో క్రికెట్‌, సెటిల్‌గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. చదువుతో పాటు పిల్లలకు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా ప్రతిభ ఉంటే మంచి క్రీడాకారులుగా రాణించవచ్చన్నారు. సత్యనారాయణ, కిషోర్‌, కృష్ణ, ఓంరాజ్‌, చంద్రకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ, మంగాపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పౌర్ణమిని పురస్కరించుకుని అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ డివిజన్‌ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్‌ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని, ఈ కార్యక్రమానికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు. నిర్వాహకులు బ్రహ్మయ్య, సమ్మని మురళిచారి, విక్రమ్‌ ఠాగూర్‌, కొండల్‌రెడ్డి, సమ్మని సత్యనారాయణ, పవన్‌కుమార్‌, ప్రభాకర్‌చారి, సురేష్‌, సాయినాథ్‌, రామకృష్ణ, పాండురంగారావు, శ్రీశైలం తదితరులున్నారు.

తాగునీటి వృథా !



రోడ్డుపై పారుతున్న తాగునీరు

బోడుప్పల్‌: సూరజ్‌నగర్‌ కాలనీ ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైన్‌ వాల్వ్‌ వద్ద లీకేజీ కారణంగా తాగునీరు రోడ్డు పాలవుతోంది. గతేడాది కాలంగా లీకేజీ అవుతూ రోడ్డుపై పారుతున్నాయి. దీనిపై స్థానికులు పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌

అల్వాల్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మచ్చబొల్లారం డివిజన్‌ కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌ కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ను కోరారు. సోమవారం కాలనీవాసులతో కలిసి జెడ్సీకి ఆయన వినతిపత్రం అందజేశారు. లాల్‌రెడ్డి కాలనీ, కృష్ణానగర్‌ కాలనీ, ప్రియదర్శిని కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని, వీటికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆదాయంపై దృష్టి పెట్టేనా?

13 పురపాలికల్లో 2025–26లో పన్నుల టార్గెట్‌ రూ.362.70 కోట్లు

- గతేడాది రూ.353.66 కోట్లకు.. వసూలైంది 80 శాతమే
- ట్రేడ్‌ లైసెన్సుల జారీ.. ఖాళీస్థలాలు, తదితర పన్ను మదింపుపై కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: పట్టణాభివృద్ధితో సహా సిబ్బంది జీతభత్యాలు, తాగునీటి వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు ఎంతగానో తోడ్పాటునిస్తున్న వివిధ రకాల పన్నుల టార్గెట్‌పై అధికార యంత్రాంగం లక్ష్యాలను ఖరారు చేసింది.

- నగర శివారుల్లోని 13 పురపాలకసంఘాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల వసూళ్ల ద్వారా రూ.362.70 కోట్లు రాబట్టాలని కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేయగా.. జిల్లా అధికార యంత్రాంగం ఆమోద ముద్ర వేసింది.
- గతేడాది (2024–25 ఆర్థిక సంవత్సరం)లో నగర శివారు 13 పురపాలక సంఘాల్లో వివిధ రకాల పన్నుల రూపేణా రూ.353.66 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, 80 శాతానికి మించి వసూలు చేయలేకపోయాయి. కొన్ని పురపాలక సంఘాలు మాత్రం లక్ష్యాలకు చేరువకావటానికి తీవ్ర ప్రయత్నం చేశాయి. పురపాలికల్లో పన్నుల మదింపు, అక్రమకట్టడాలు, అనుమతిలేని నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ.. చేతివాటం ప్రదర్శిస్తున్న పలువురు పుర అధికారులు, సిబ్బంది భరతం పట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

పురపాలికల్లో ఇలా..

నగర శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్‌, పీర్జాదిగూడ, నిజాంపేట, జవహర్‌నగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్లు, పోచారం, ఘట్కేసర్‌, నాగారం, దమ్మాయిగూడ, తూముకుంట, కొంపెల్లి, దుండిల్‌, గుండ్లపోచంపల్లి, మేడ్చల్‌ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇటీవల ఏడు మున్సిపాలిటీల్లో 28 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ప్రత్యేక అధికారులను కూడా నియమించింది. ఆదాయం పెరిగిందని భావించినా.. ఆశించిన స్థాయిలో అధికారులు దృష్టి సారించలేరనే విమర్శలున్నాయి.

పన్నుల మదింపుపై...

పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటే అనుమతులు, ఇంటిపన్ను, నల్లా పన్నుల మదింపు వంటివి చేయడంతో పాటు వాణిజ్య, వ్యాపారసంస్థలకు ట్రేడ్‌ లైసెన్స్‌ జారీ చేయడం తప్పనిసరి చేసినప్పటికీ, వాటి జారీలో పలువురు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో లక్ష్యానికి తగినట్లుగా ఆదాయం రావడం లేదు.

ఆన్‌లైన్‌ ద్వారా అనుమతులు..

హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర షాపింగ్‌మాల్స్‌ వంటి అన్ని రకాల వ్యాపార సముదాయాలకు ట్రేడ్‌ లైసెన్స్‌ అవసరముంటోంది. వీరంతా ఆన్‌లైన్‌ తర్వాత అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కానీ నగర శివారు పరిధిలో పదుల సంఖ్యలో మాంసం దుకాణాలు ఉండగా.. కొలతలతో సంబంధం లేకుండానే రూ. 1000 చొప్పున నిర్ణయించి, అదనంగా ఒక్కో దుకాణానికి రూ.700 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల ట్రేడ్‌ లైసెన్సుల జారీలో కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు.

రెన్యువల్‌ లేక...

నగర శివారుల్లో వ్యాపారం నిర్వహించాలంటే పురపాలక సంఘం నుంచి రుసుము చెల్లించి ట్రేడ్‌ లైసెన్సు పొందాలి. రుసుము విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. చదరపు అడుగుకు రూ.5 చొప్పున నిర్ణయించారు. సాధారణంగా షోరూంలు, మిల్లులు, సరకు నిల్వచేసే హోల్‌సెల్‌ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటోంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటోంది. లైసెన్సు పొందిన వారు కూడా రెన్యువల్‌ చేసుకోవటానికి వెనకాడుతున్నారు.

ట్రేడ్‌ లైసెన్సు లేనివెన్నో...

నిజాంపేట మున్సిపల్‌ కార్పొరేషన్‌లో 4,854 వ్యాపార సముదాయాలకు 2,935 మాత్రమే ట్రేడ్‌ లైసెన్సులు జారీ చేశారు. పోచారం మున్సిపాలిటీలో 511 వ్యాపార సముదాయాలకు 273 వాటికి మాత్రమే ట్రేడ్‌ లైసెన్సులు ఉన్నాయి. ఇదే పరిస్థితి మిగతా పురపాలక సంఘాల్లో నెలకొంది.

- బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్పా.. మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్‌ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ అంశాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపటంతో పాటు కొరడా ఝులిపించటానికి సిద్ధమవుతోంది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాల వారీగా పన్నుల వసూళ్ల టార్గెట్‌లో గతేడాది, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పురపాలక సంఘం	ఆర్థిక సంవత్సరం 2024-25(కోట్లల్లో)	ఆర్థిక సంవత్సరం 2025-26(కోట్లల్లో)
బోడుప్పల్‌	రూ.32.51 కోట్లు	రూ.31.60 కోట్లు
పీర్జాదిగూడ	రూ35.17 కోట్లు	రూ.38.14 కోట్లు
జవహర్‌నగర్‌	రూ.14.64 కోట్లు	రూ.15.38 కోట్లు
నిజాంపేట్‌	రూ.75.21 కోట్లు	రూ.78.08 కోట్లు
పోచారం	రూ.26.38 కోట్లు	రూ.27.71 కోట్లు
తూముకుంట	రూ.17.20కోట్లు	రూ.18.32 కోట్లు
నాగారం	రూ.23.62 కోట్లు	రూ.22.61 కోట్లు
మేడ్చల్‌	రూ.15.87 కోట్లు	రూ.16.07 కోట్లు
కొంపల్లి	రూ.16.01 కోట్లు	రూ.17.99 కోట్లు
ఘట్‌కేసర్‌	రూ.12.26 కోట్లు	రూ.11.14 కోట్లు
గుండ్లపోచంపల్లి	రూ.17.26కోట్లు	రూ.21.35 కోట్లు
దమ్మాయిగూడ	రూ.23.20కోట్లు	రూ.23.27 కోట్లు
దుండిగల్‌	రూ.44.26కోట్లు	రూ.40.99 కోట్లు
మొత్తం	రూ.353.66 కోట్లు	రూ.362.70 కోట్లు

సమ్మె పోస్టర్‌ ఆవిష్కరణ

మేడ్చల్‌: 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను మేడ్చల్‌లో సీఐటీయూ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెను 20న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. మండల సీఐటీయూ నాయకులు నరేష్‌, నర్సింగ్‌రావు, వసంత, మల్లేష్‌, కొమురయ్య, పూజ, నర్సింగ్‌రావు, ప్రశాంత్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బీరు సీసాతో దాడి.. కేసు నమోదు

పోచారం: తలపై బీరు సీసాతో కొట్టిన వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్‌ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని సాయినగర్‌కు చెందిన దేవరకొండ నరేష్‌చారి, ఆటో డ్రైవర్‌ బషీ, మరో వ్యక్తి కలిసి ఓ వైన్స్‌లో ఆదివారం మద్యం సేవిస్తూ వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో నరేష్‌ తలపై బీరు సీసాతో బషీ కొట్టడంతో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న బాధితుడి సోదరి ఘటనా స్థలానికి చేరుకుని, చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. మెరుగైన వైద్యం కోసం నీలిమా ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం బాధితుడి సోదరుడు రాజేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



గౌతంనగర్‌: డివిజన్‌ మల్లికార్జుననగర్‌లోని దతాగత బుద్ధ విహార్‌లో సోమవారం బుద్ధపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్త శామావతి హాజరై బుద్ధుని బోధనలు వివరించారు. ప్రశాంతమైన జీవితానికి గౌతమ బుద్ధుని బోధనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విజయ్‌కుమార్‌జాదవ్‌, అనంతరావు, సోమ్‌తకే, అడ్వకేట్‌ మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడిని పాటించాలి

- వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు రాములునాయక్‌



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు రాములునాయక్‌

పోచారం: రైతులు ఒకే వంటను ఒకే పొలంలో ఎక్కువసార్లు పండించడం వల్ల భూసారం తగ్గుతుందని, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు ఎస్‌. రాములునాయక్‌ అన్నారు. సోమవారం పోచారంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, ఫార్మర్‌ రిజిస్ట్రీ' కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భూసారాన్ని పెంచేందుకు రైతులు తప్పనిసరిగా పంటమార్పిడి పద్ధతిని పాటించాలన్నారు. వరిపంటకు బదులుగా చిరుధాన్యాలు, జొన్న, సజ్జ, రాగులు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సహజ సేంద్రియ పద్ధతులతో పంటలు సాగుచేస్తే చీడపీడలు తగ్గి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు డా.సి.నరేందర్‌రెడ్డి, డా.సురేష్‌, ఎండీ.బాసిత్‌, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, అభ్యుదయ రైతులు ఎస్‌. రాములు, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి, బాల్‌రెడ్డి, సుదర్శన్‌ తదితరులున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ వెంకటఉపేందర్‌ రెడ్డి, కీసర తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌

కీసర: మండలంలోని రాంపల్లి, కుందన్‌పల్లిలో సోమవారం భూభారతి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌లు హాజరై సదస్సుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చక్కటి వేదిక అన్నారు. ఈ సదస్సులో రాంపల్లిలో 89, కుందన్‌పల్లిలో 40, మొత్తం 129 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను భూ భారతి పోర్టల్‌లో నమోదు చేసి తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీమ్‌ సభ్యులకు సూచించారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాను లాగిన్‌ ద్వారానే పంపాలి

- జిల్లా రాజీవ్‌ యువ వికాస కమిటీ కన్వీనర్‌ సాంబశివరావు



సాక్షి,సిటీబ్యూరో: రాజీవ్‌ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసి అర్హుల జాబితాను సంబంధిత శాఖల అధికారులు లాగిన్‌ ద్వారానే పంపాలని మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా రాజీవ్‌ యువ వికాస కమిటీ కన్వీనర్‌, డీఆర్డీఓ సాంబశివరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌ వీసీహాల్‌లో రాజీవ్‌యువవికాస పథకం అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లోని ఎక్సెల్‌ స్ప్రెడ్‌షీట్‌లో ఏరోజుకారోజు వెరిఫికేషన్‌, పెండింగ్‌ వివరాలు అప్‌డేట్‌ చేయాలని కమిటీ కన్వీనర్‌ పేర్కొన్నారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తుదారులకు సిబిల్‌ వెరిఫికేషన్‌ అవసరం లేనందున ముందుగా వాటిని పరిశీలించి, బ్యాంక్‌ల ద్వారా సెలెక్ట్‌ లిస్టును తెప్పించుకుని, కార్పొరేషన్‌ లాగిన్‌లోకి పంపాలన్నారు. దరఖాస్తుదారుల ఎంపిక విషయంలో సంబంధిత అధికారుల మానిటరింగ్‌ తప్పనిసరి చేయాలన్నారు. ఎల్డీఎం వెంకటేశ్వరరావు, ఎస్సీ అభివృద్ధిశాఖాధికారి వినోద్‌కుమార్‌, బీసీ వెల్ఫేర్‌ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ బాబుమోసిస్‌, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా ఉపాధిశాఖాధికారి రాధిక, మత్స్యశాఖాధికారి సుకీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు సంఘీభావం

మౌలాలి: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్‌ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని మౌలాలి డివిజన్‌ కార్పొరేటర్‌ సునీతాశేఖర్‌యాదవ్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శామీర్‌పేటలోని నివాసంలో సోమవారం ఈటల రాజేందర్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. సరిహద్దులో సైనికులు ప్రాణాలకు తెగించి యుద్ధం చేస్తుంటే వారిపై విషం చిమ్ముతున్న వాళ్లను అరెస్ట్‌ చేయకుంటే దేశద్రోహులకు అండగా నిలిచినట్లు అవుతుందన్నారు. జగ్గారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, దేశం, మల్కాజ్‌గిరి ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఈటలకు క్షమాపణ చెప్పాలన్నారు.

అమరవీరుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఘట్‌కేసర్‌: కర్రెగుట్టల్లో నక్సలైట్ల మందుపాతరకు బలైన గ్రేహౌండ్స్‌ కమాండో తిక్క సందీప్‌ కుటుంబీకులను జన చైతన్య సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. సోమవారం వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరి యాదవ్‌ కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 50 వేలు అందజేశారు. ప్రేమ్‌కుమార్‌, భూషణ్‌ చారి, రవీందర్‌, సురేష్‌, గోపాల్‌గౌడ్‌, ప్రసన్నకుమార్‌, సుబ్బారావు, హైమద్‌, రాజు, జగదీష్‌, శివశంకర్‌, ప్రశాంత్‌, రవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి నివాళి

హబ్సిగూడ: ఇటీవల మరణించిన ఉప్పల్‌ మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి చిత్రపటానికి మాజీ మంత్రి కేటీఆర్‌ నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సోమవారం రాజిరెడ్డి నివాసానికి మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు మాజీమంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్‌, ముఠాగోపాల్‌, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌, గంద్ర వెంకటరమణరెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, తుల ఉమ, గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌, రాకేష్‌, నగేష్‌, వాసుదేవారెడ్డి తదితరులున్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



పోచారం: వెంకటాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను గత మూడురోజులుగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్‌ శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పోచారం మాజీ చైర్మన్‌ కొండల్‌రెడ్డి, నాయకులు మహేష్‌గౌడ్‌, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ చైర్మన్‌ సత్తయ్య, సభ్యులు ఆంజనేయులు, వెంకటేష్‌, లావణ్య, సుధాకర్‌, కార్యనిర్వహణాధికారి భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

బాలాజీనగర్‌లో నిర్మాణాల కూల్చివేత !

- స్పృహ తప్పిన మహిళ, ఆసుపత్రికి తరలింపు



జవహర్‌నగర్‌: కార్పొరేషన్‌ పరిధిలోని బాలాజీనగర్‌లో పలు కట్టడాలను కాప్రా తహసీల్దార్‌ సుచరిత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా పేద మహిళ బుచ్చమ్మ తన ఇంటిని కూల్చొద్దని మొరపెట్టుకున్నా.. జేసీబీతో అధికారులు కూల్చివేశారు. దీంతో ఆమెకు ఫిట్స్‌ రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. పేదోళ్ల ఇళ్లే లక్ష్యంగా జేసీబీతో నేలమట్టం చేయడం దుర్మార్గమని, రెవెన్యూ అధికారుల కూల్చివేతల వల్లే అమాయక ప్రజల ప్రాణాలు పోతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

పురపాలికల్లో సతమతం !

- ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- రూ. లక్షల్లో పన్ను వసూలైనా.. ముందుకుసాగని పనులు
- శివారు పురపాలికల్లో వీధిలైట్లు లేక రోడ్డు ప్రమాదాలు
- మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- పుర యంత్రాంగం చేతివాటంపై చూపిస్తున్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై చూపడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలంలో అనేక మౌలిక సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు.

వీధిలైట్లు వెలగక ప్రమాదాలు

పోచారం మున్సిపాలిటీలో ప్రధాన రహదారిపై వీధిలైట్లు వెలగడం లేదు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తను పారబోయడంతో గాలికి వ్యర్థాలు కొట్టుకొచ్చి ఇళ్ల మధ్య చేరుతున్నాయి. నారపల్లి నుంచి అన్నోజిగూడ, టౌన్‌షిప్‌ ప్రధాన రహదారిపై వీధిలైట్లు వెలగడం లేదు. రోడ్డు పక్కన మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజా సమస్యలపై మొరపెట్టుకునేందుకు అనుమతి ఇవ్వకుండా.. పైరవీకారులు, బిల్డర్లతో కాలం వెల్లదీస్తున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

- బోడుప్పల్‌, గుండ్లపోచంపల్లి, పోచారం, పీర్జాదిగూడ పురపాలికల్లో చిన్నపాటి వర్షం పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. జవహర్‌నగర్‌, నిజాంపేట మున్సిపల్‌ కార్పొరేషన్లు, మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్‌, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీల్లో ప్రజా సమస్యలు అత్యధికంగా ఉన్నాయి. శివారు పట్టణాలను హైదరాబాద్‌ నగరానికి సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు రూపొందించినా..అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక అడుగు కూడా ముందుకు పడటం లేదనే ఆరోపణలున్నాయి.

సమీకృత మార్కెట్లు అంతే..

13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్లకు అర ఎకరం నుంచి రెండెకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని కేటాయించిన అధికార యంత్రాంగం .. జవహర్‌ నగర్‌, నిజాంపేట్‌, బోడుప్పల్‌, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో మార్కెట్ల భవనసముదాయాలు, పార్కింగ్‌ నిర్మాణానికి రూ.4.5 కోట్ల చొప్పున, మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్‌, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున అప్పటి ప్రభుత్వం నిధుల విడుదల జాప్యంతో నాలుగున్నర ఏళ్ల గడిచినా ఇప్పటి వరకు ఒకటి కూడా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

కోట్లల్లో పన్నులు..

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా ప్రతి ఏటా దాదాపు రూ. 360 కోట్లు వస్తుండగా..15వ, ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతినెల ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. ఈ నిధులన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ, పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ధ్రువీకరణ పత్రాలకు పాట్లు..

పురపాలికల్లో జనన, మరణ ధ్రువీకరణపత్రాలతో సహా మ్యూటేషన్‌, ట్రేడ్‌లైసెన్సుల జారీ వంటి పత్రాల కోసం ఆయా పట్టణాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పనికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.